

సాక్షి
పల్నాడు
శనివారం । 5 । అక్టోబర్ । 2024



పులిచింతల నీటినిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 31,897 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 29,898 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 588.00 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 10,822 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

గజలక్ష్మీదేవీగా అమ్మవారు



క్రోసూరు: క్రోసూరులోని వాసవీ కన్యకా పరమేశ్వరీఅమ్మవారు శుక్రవారం గజలక్ష్మీ దేవీగా భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. మహిళలు సాయంత్రం బతకమ్మ ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

న్యూస్‌రీల్

బాలాత్రిపురసుందరి దేవిగా బాలచాముండేశ్వరి దర్శనం




అమరావతి: అమరావతిలో వేంచేసి ఉన్న బాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో శ్రీ దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలలో భాగంగా రెండో రోజైన శుక్రవారం బాలాత్రిపుర సుందరిదేవి అలంకారంలో బాలచాముండేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలలో భాగంగా చండీ, రుద్రహోమాలు, శ్రీ చక్రార్చన నిర్వహించారు. ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ బాలత్రిపురసుందరిదేవి అలంకార విశిష్టతను వివరించారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసురమర్దని అమ్మవార్లకు కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని ధనలక్ష్మీగా అలంకరించారు. ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో దేవాలయాలను సందర్శించి పూజలలో పాల్గొన్నారు.

(క్రైం) ఏఎస్పీగా సుప్రజ



నగరంపాలెం: రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం ఐదుగురు ఏఎస్పీలను బదిలీ చేస్తూ ప్రిన్సిపల్ కార్యదర్శి కుమార్ విశ్వజీత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఏసీబీ ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్న కె.సుప్రజను గుంటూరు జిల్లా ఏఎస్పీ (క్రైం)గా బదిలీ చేశారు. గతంలో ఆమె గుంటూరు జిల్లా ఏఎస్పీ (పరిపాలన)గా, గుంటూరు పశ్చిమ, గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీగా విధులు నిర్వర్తించారు. ఇక గుంటూరు జిల్లా లా అండ్ ఆర్డర్ ఏఎస్పీ కొల్లి శ్రీనివాసరావు.. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీగా బదిలీ అయ్యారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 8004 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 320 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 1760 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 585 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 230 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 500 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 3280 క్యూసెక్కులు విడుదల చేశారు.

యార్డులో 49,880 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 42,191 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 49,880 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ. 16,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 18,800 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 9,500 నుంచి రూ. 16,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,000 నుంచి రూ. 18,600 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 19,029 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

కారంచేడు సభలో మంత్రి రవికుమార్

కారంచేడు: దశాబ్దాల కాలం క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తామని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హామీ ఇచ్చారు. శుక్రవారం మండల కేంద్రమైన కారంచేడు రెండు చెరువుల మధ్యన కేంద్ర ప్రభుత్వంతోపాటు, ఓఎన్‌జీసీ నిధులతో సుమారు రూ 3.05 కోట్లతో నిర్మించనున్న కమ్యూనిటీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ మొదటి దశ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. పర్చూరు నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఎప్పుడో వేసిన విద్యుత్ స్తంభాలు రోడ్డుకు దిగువన ఉండటం

లడ్డూ బాబుకు లెంపకాయ



తిరుమల లడ్డూ వ్యవహారంలో చంద్రబాబు సర్కారుకు ఎదురుదెబ్బ

- సుప్రీం నిర్ణయాన్ని స్వాగతిస్తున్న ధార్మికవాదులు, ప్రజానాయకులు
- రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన సిట్ రద్దుతో బాబు కుట్రలు భగ్నం
- తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా కూటమి ప్రభుత్వం వైఖరి
- వైఎస్ జగన్‌ను రాజకీయంగా దెబ్బతీయడానికి లడ్డూ వివాదం లేపారని ఆగ్రహం

సాక్షి, నరసరావుపేట: తన రాజకీయ తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు చంద్రబాబు పవిత్రమైన తిరుమల లడ్డూ నెయ్యిలో కల్తీ ఉందంటూ చేసిన కుట్రలు భగ్నమయ్యాయి. ఎటువంటి ఆధారాలు లేకుండానే రాజకీయ లబ్ధి కోసం చంద్రబాబు ఆరోపణలు చేయడం పట్ల కోర్టు మొట్టికాయలు వేసిందని ధార్మికవాదులు, ప్రజానాయకులు అభిప్రాయపడుతున్నారు. మాజీ ముఖ్యమంత్రిని రాజకీయంగా దెబ్బతీసేందుకు చంద్రబాబునాయుడు చేసిన నిరాధారోపణలు నిజం చేసేందుకు కుట్రతో రాష్ట్ర ప్రభుత్వం వేసిన సిట్‌ను కాదని సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో విచారణ జరపాలని సుప్రీం కోర్టు నిర్ణయించడంపై ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు అండ్ కో కుట్రలను ఛేదించుకొని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పునీతుడై నిలుస్తాడని ధార్మికవాదులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన ముగిసినా ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చకపోవడంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రజల్లో వ్యతిరేకత, ప్రతిపక్షాల నుంచి విమర్శలు మొదలయ్యాయి. దీనినుంచి బయట పడేందుకు బాబు సర్కార్ తిరుమల లడ్డూ కల్తీ అయ్యిందంటూ తప్పుడు ప్రచారాన్ని తెరపైకి తెచ్చిందని ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఆరోపిస్తోంది. కల్తీపై ఆధారాలు లేకపోయినా రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న ముఖ్యమంత్రి ఎలా మాట్లాడతారని విమర్శలు చేశారు. పైగా విచారణ కోసం సిట్‌ను నియమించిన సీఎం తానే కల్తీ జరిగిందని ప్రకటిస్తే ఆ ప్రభావం సిట్‌పై పడి దర్యాప్తు ఎలా నిష్పాక్షికంగా సాగుతుందని అన్ని వర్గాల నుంచి విమర్శలు వచ్చాయి. వైఎస్సార్‌సీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీంతో సుప్రీం న్యాయస్థానం శుక్రవారం చంద్రబాబు వేసిన సిట్ రద్దు చేయడమే కాకుండా ఆయన కూటమి సర్కార్‌కు చెంప పెట్టు లాంటి తీర్పు నిచ్చింది. దేవుడిని రాజకీయాల్లోకి లాగొద్దని హెచ్చరించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు దిగజారుడు రాజకీయ ఎత్తుగడలతో కలియుగ దైవం వెంకటేశ్వరస్వామితోనే రాజకీయ క్రీడలకు తెగబడడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సుప్రీం నిర్ణయాన్ని అన్ని వర్గాల వారు స్వాగతిస్తున్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లకు సుప్రీం నిర్ణయం చెంపపెట్టులాంటిదని వ్యాఖ్యానిస్తున్నారు. బేషరతుగా వీరిద్దరూ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ అన్ని వర్గాల నుంచి వినిపిస్తోంది.


దేవుడితో రాజకీయాలు చేయడం తగదు...



దేవుడిని రాజకీయాల్లోకి లాగడం మంచిది కాదు. ఇదంతా సీఎం చంద్రబాబు కల్పించిన కల్పితం. అందుకే సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసింది. కల్తీ జరిగినట్టు సరైన ఆధారాలుంటే మేము కూడా రోడ్డెక్కి నిరసన కార్యక్రమాలు చేసేవాళ్లం. ఇన్ని రోజులు లేనిది ఇప్పుడెందుకు సున్నితమైన అంశాలను లేవనెత్తుతున్నారు. ఇదంతా అబద్ధపు ప్రచారాలు.

–ముత్తనపల్లి శివకృష్ణప్రసాద్, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు

సుప్రీం నిర్ణయం అభినందనీయం...



తిరుమల లడ్డూ వ్యవహారంలో రాజకీయ జోక్యం మంచి పరిణామం కాదు. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా రాజకీయ నాయకులు మాట్లాడటం అభ్యంతరకరం. సుప్రీం కోర్టు ఇచ్చిన కీలక తీర్పు అభినందనీయం. రానున్న రోజుల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నాం.

–భాగవతుల రవికుమార్, పల్నాడు జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు

డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమే...



ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలుచేయటంలో విఫలమైన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు టీటీడీ లడ్డూ కల్తీ వ్యవహారం తెర పైకి తీసుకొచ్చారు. ఇది చాలా దారుణం. కులాలు, మతాలకతీతంగా పరిపాలన చేయాల్సిన వీరు రాజ్యాంగ నిబంధనలు పట్టించుకోకుండా వ్యవహరించటం ఏమాత్రం సరికాదు. కల్తీ జరిగితే అధికారులు తేల్చాల్సివుంది. అది తేలకుండానే ప్రతిపక్ష నాయకులపై ఆరోపణలు చేయటం సబబుకాదు. ఎవరు కారకులు అనేది విచారణ అనంతరమే తేల్చాలి.

–వై.వెంకటేశ్వరరావు, పీడీఎం రాష్ట్ర నాయకులు, నరసరావుపేట

రాజకీయ లబ్ధి కోసమే ఆరోపణలు



తిరుమలలో తయారయ్యే లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని ఆరోపించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సుప్రీంకోర్టు నిర్ణయం ఒక చెంపపెట్టు లాంటిది. నాకు డెయిరీ ఇండస్ట్రీలో 30 సంవత్సరాల అనుభవం ఉంది. ఆవు నెయ్యిలో అలాంటి పదార్థాలు కలిపితే వెంటనే వాసన వస్తుంది. చంద్రబాబుకు కూడా డెయిరీ ఉంది. ఇలాంటి కల్తీ జరిగే అవకాశం లేదని తెలిసి కూడా రాజకీయ లబ్ధి కోసం ఆరోపణలు చేయడం దారుణం. సుప్రీంకోర్టు నిర్ణయాన్ని మేము స్వాగతిస్తున్నాం. లడ్డూ వ్యవహారంలో నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.

–బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే, వినుకొండ

జగన్ పునీతుడుగా నిలుస్తాడు...



తిరుమల లడ్డూ విషయంలో చంద్రబాబు, పవన్‌లు చేసిన ఆరోపణలు తప్పు అని సుప్రీం తీర్పుతో నిరూపించబడ్డాయి. తప్పు జరిగి ఉంటే దానికి పాల్పడిన వారికి శిక్షపడాల్సిందే. ఎటువంటి తప్పు లేకుండానే ఇటువంటి రాజకీయ వ్యాఖ్యలు చేయడం సరికాదు. ఈ విషయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పునీతుడై వివాదం నుంచి బయటపడతాడు.

–మేళ్లచెరువు కుమార్, శ్రీవాగ్దేవి స్మార్త పురోహిత సంఘం అధ్యక్షుడు, నరసరావుపేట

బాబు, పవన్‌లు రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలి



తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదంలో ఎటువంటి కల్తీ జరగకపోయినా జరిగినట్లుగా హిందువుల మనోభావాలను గాయపరుస్తూ చేసిన ఆరోపణలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలి. వీరి ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తున్నా. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బదనాం చేయాలనే ఉద్దేశంతో ఈ లడ్డూ వ్యవహారం బయటకు తెచ్చారు. రాష్ట్రప్రభుత్వం ఏర్పాటుచేసిన సిట్‌ను రద్దుచేసి సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో సిట్ ఏర్పాటు చేయటమంటేనే రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినట్టే.

–డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే...



నెయ్యి కల్తీపై సరైన ఆధారాలు లేకుండానే చంద్రబాబు లడ్డూ వివాదం లేపారు. అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయినా సూపర్-6 పథకాలను అమలు చేయలేకపోవడంతో వస్తున్న వ్యతిరేకత నుంచి తప్పించుకోవడానికి మత రాజకీయాలు చేస్తున్నట్టు స్పష్టమవుతోంది. బీజేపీ డైరెక్షన్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా ఏపీ రాజకీయాలు సున్నితమైన మతాల చుట్టూ తిరుగుతున్నాయి. మణిపూర్‌లో మానవ హక్కులు కాలరాస్తున్నా పవన్ కల్యాణ్ ఇప్పటివరకు స్పందించలేదు. మోదీ చేసిన తప్పులకు పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత దీక్ష చేస్తే బాగుండేది.

–జీ అలెగ్జాండర్ సుధాకర్, డీసీసీ అధ్యక్షుడు, పల్నాడు జిల్లా

రాష్ట్ర ప్రభుత్వానికి చెంప దెబ్బ



సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో సిట్ ఏర్పాటు చేయమంటూ సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం రాష్ట్ర ప్రభుత్వానికి చెంప దెబ్బ లాంటిది. ఏ మాత్రం ఆధారాలు లేకుండా మాజీ సీఎం జగన్‌పైన, అప్పటి టీటీడీ చైర్మన్, అధికారులపై ఆరోపణలు చేయటం ఏమాత్రం సబబు కాదని పరోక్షంగా చెప్పింది. ముఖ్యమంత్రి ముందుగానే కల్తీ జరిగిందని ప్రకటించి ఆ తర్వాత రాష్ట్రంలోని అధికారులతో సిట్ ఏర్పాటుచేస్తే.. ఆ అధికారులు సీఎం ప్రకటనను కాదని నివేదిక ఇస్తారా? సుప్రీంకోర్టు మంచి నిర్ణయం తీసుకుంది. పవన్ కల్యాణ్ మతాల మధ్య చిచ్చుపెట్టేలా వ్యవహరిస్తున్నారు.

–షేక్ మౌలాలి, ఎంఐఎం నరసరావుపేట పట్టణ అధ్యక్షులు

పండుగ నెలలోనూ పస్తులే...

- రెండు నెలలైనా అందని వేతనాలు
- స్పందించని ప్రభుత్వం
- సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆవేదన



గత నెల 25న ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు

సత్తెనపల్లి: విద్యాశాఖ కార్యక్రమాల అమల్లో కీలక పాత్ర పోషించే సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆకలి కేకలు పాలకులకు పట్టడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు గడుస్తున్నా ... వారి సమస్యలు ఆలకించకపోగా, కనీసం వేతనాలు కూడా సకాలంలో చెల్లించడం లేదు. ఆగస్ట్, సెప్టెంబర్ వేతనాలపై ఇప్పటికీ స్పష్టత ఇవ్వకపోగా .. వేతనాలకు నిధులు లేవని ఉన్నతాధికారులు చెప్పడంతో గమనార్హం. ఈ దసరా పర్వదినానికి తమ కుటుంబాలు అర్థాకలితో అలమటించక తప్పదా..? అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు స్పందించి పెండింగ్ వేతనాలు అయినా దసరా పర్వదినానికి ముందు చెల్లించేలా చూడాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు వేడుకుంటున్నారు. ఇప్పటికే ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, సీఐటీయూ నేతలు ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రాలు అందించినప్పటికీ ఇంత వరకు కదలిక లేకపోవడం గమనార్హం.

చిరుద్యోగులపై శీత కన్ను...

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సీఆర్పీలు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, అకౌంటెంట్లు, పీటీఐలు, ఐఈఆర్టీలు.. ఇలా వర్కింగ్ 288 మంది, 83 మంది నాన్ వర్కింగ్ ఉద్యోగులు జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఏటా కొనసాగింపు ఉత్తర్వులు ఇస్తున్నారు. డిగ్రీ, బీఈడీ వంటి ఉన్నత అర్హతలతో ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు 22 రోజులపాటు సమ్మె చేయగా ... నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వీరి సమస్యలకు పరిష్కారం చూపేలా కమిటీ ఏర్పాటు చేసింది. అప్పటి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో పలు దఫాలుగా చర్చించిన కమిటీ ఉద్యోగ భద్రతకు స్పష్టమైన హామీ ఇచ్చింది. ఈలోగానే ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో వీరి సమస్య మళ్లీ మొదటికి వచ్చినట్లైంది. కూటమి ప్రభుత్వం సమగ్ర శిక్షలోని చిరుద్యోగుల సమస్యలపై ఏమాత్రం దృష్టి సారించక పోవడంతో వారంతా మదన పడుతున్నారు.

భారంగా మారిన పని ఒత్తిడి

సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనాలు సకాలంలో చెల్లించకపోగా .. విధుల నిర్వహణలో పని ఒత్తిడికి గురవుతున్నారు. సింగల్ టీచర్ ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయుడు సెలవుపై వెళితే అలాంటి చోట్ల కాంప్లెక్స్ సీఆర్పీలకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. కమిషనరేట్ నుంచి ఉత్తర, ప్రత్యుత్తరాలకు సమాచార సేకరణలో భాగంగా సమయపాలన లేకుండా విధులు నిర్వహించాల్సి వస్తుందని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. మహిళా ఉద్యోగులను రాత్రి 9 గంటల వరకు మండల విద్యా వనరుల కార్యాలయాల్లో పనిచేయిస్తుండడంపై వ్యతిరేకత వ్యక్తం అవుతున్నా... వారి గోడు పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

ఐసీఐసీఐ బ్యాంకు ఖాతాదారుల ఆందోళన

- బ్యాంకు వద్ద రెండో రోజు నిరసనలు
- కొలిక్కిరాని డిపాజిట్ల వ్యవహారం
- రూ.30 కోట్లుపైనే గోల్‌మాల్



బ్యాంకు వద్ద ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఖాతాదారులు

చిలకలూరిపేట: పొలం అమ్మి ఒకరు... ఇల్లు అమ్మి మరొకరు... వృద్ధాప్యంలో ఉపయోగపడతాయని మరికొందరు బ్యాంకులో డిపాజిట్ చేసుకుంటే ... కుటుంబ అవసరాలకు బంగారంపై రుణం తీసుకున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఒక వైపు బ్యాంకుపై నమ్మకంతో కోట్లాది రూపాయలు డిపాజిట్ చేసుకున్న వారు తీవ్ర ఆందోళనకు గురవుతుంటే... మరోవైపు బ్యాంకు అధికారుల నుంచి నిర్దిష్టమైన హామీ లభించక వారి ఆందోళన మరింత రెట్టింపు అవుతోంది. చిలకలూరిపేట ఐసీఐసీఐ బ్యాంకులో భారీ కుంభకోణం వెలుగు చూసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో రెండో రోజైన శుక్రవారం బాధిత ఖాతాదారులు ఐసీఐసీఐ బ్యాంకు బ్రాంచి వద్దకు చేరుకొని ఆందోళనకు దిగారు. తాము బ్యాంకులో దాచుకున్న డబ్బు వెంటనే చెల్లించాలని, బ్యాంకు అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బు చెల్లించనిదే బ్యాంకు ముందు నుంచి కదిలేది లేదని భీష్మించారు. అర్బన్ సీఐ పి రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు బ్యాంకు వద్దకు చేరుకొని ఖాతాదారులకు సర్ది చెప్పేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ బ్యాంకు అధికారుల నుంచి నిర్దిష్టమైన హామీ లభించనిదే ఆందోళన విరమించేది లేదని మొండికేశారు. ఈ నేపథ్యంలో బ్యాంకు జోనల్ మేనేజర్ సందీప్ మెహ్రా, రీజినల్ హెడ్ రమేష్ ఖాతాదారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కోట్లాది రూపాయల ఖాతాదారుల సొమ్ము గోల్‌మాల్ జరిగే వరకు బ్యాంకు ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. అసలు ఎంత మొత్తం గోల్‌మాల్ జరిగిందో చెప్పాలంటూ నిలదీశారు. తమ డబ్బుకు గ్యారెంటీ ఏమిటని ప్రశ్నించారు. కుంభకోణం వెలుగు చూసిన మొదటి రోజు తమ బ్యాంకులో ఎలాంటి అవకతవకలు జరిగే అవకాశం లేదంటూ బుకాయించే ప్రయత్నం చేసిన బ్యాంకు అధికారులు, రెండో రోజు ఖాతాదారుల ఆందోళన, ఆగ్రహాల నేపథ్యంలో బ్యాంకులో అవకతవకలు జరిగిన మాట వాస్తవమేనని ఒప్పుకున్నారు. అంతర్గత విచారణ అనంతరం మాత్రమే సరైన డిపాజిట్ బాండ్లు, రశీదులు ఉన్నవారికి డబ్బులు చెల్లిస్తామని, ఇప్పటికిప్పుడు చెల్లించేది లేదని తేల్చి చెప్పారు. ఎవరు ఎంత బ్యాంకులో డిపాజిట్ చేసింది వివరాలతో దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని మాత్రమే హామీ ఇచ్చారు. దీంతో బాధిత ఖాతాదారులు తమ వివరాలను బ్యాంకులో అందజేశారు. అయితే పలువురు ఎన్నారైలు, ప్రస్తుతం ఇతర రాష్ట్రాలకు వెళ్లి ఉన్న వారు సైతం కొంతమంది ఇదే బ్యాంకులో చేసిన డిపాజిట్ల విషయం ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. బ్యాంకు వద్ద ఆందోళనకు దిగిన వారు తెలుపుతున్న వారి వివరాల ప్రకారమే సుమారు రూ.30 కోట్లు పైబడి గోల్‌మాల్ జరిగినట్లు తెలుస్తుండగా, సోషల్‌మీడియా, ఇతర ప్రసారమాధ్యమాల్లో ఇంకా ఎక్కువ మొత్తంలోనే డబ్బు గల్లంతు జరిగినట్లు ప్రచారం జరుగుతోంది.

పొలం అమ్మిన డబ్బు...



బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం మా పొలం తీసుకున్నారు. పరిహారంగా లభించిన డబ్బు రూ.కోటి నా భార్య శ్రీదేవి పేరున బ్యాంకులో ఫిక్సిడ్ డిపాజిట్ చేశాం. బ్యాంకు వ్యవహారం వెలుగు చూశాక డబ్బులు చెల్లించాలని కోరితే అకౌంట్ క్లోజ్ అయ్యింది అంటున్నారు.

–తోట శీనయ్యనాయుడు

కోట్లు కోల్పోతాం...



మా అమ్మ టి లలితాదేవి పేరున ఇదే బ్యాంకులో రూ.2.85 కోట్లు ఫిక్సిడ్ డిపాజిట్ చేశాం. ఇప్పుడు ఆ సర్టిఫికెట్లు ఫేక్ అంటున్నారు. దీనికి తోడు బ్యాంకులో 45 సవర్ల బంగారం పెట్టి లోన్ తీసుకుంటే ఆ లోన్ అకౌంట్ మాకు తెలియకుండానే క్లోజ్ అయ్యింది అంటున్నారు. మా డబ్బులు, బంగారం మాకు చెల్లించాలి.

–టి సత్యనారాయణ

తీసుకున్న దానికన్నా ఎక్కువ...



బ్యాంకులో 12 సవర్ల బంగారం పెట్టి రూ.1.20 లక్షలు రుణం తీసుకున్నాం. ఇప్పుడు వచ్చి అడిగితే రుణం రూ.1.90 లక్షలు తీసుకున్నట్లు ఉందని చెబుతున్నారు. ఇంత మోసం బ్యాంకులో జరుగుతుందని ఊహించలేదు. దీనికి తోడు ఎకౌంట్ క్లోజ్ అయిందని చెబుతున్నారు.

షేక్ కరిమూన్

పాత విద్యుత్ స్తంభాలను మార్చుతాం



వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవ దృశ్యం

వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, స్థానికులు తనకు వినతిపత్రం అందించారని మంత్రి చెప్పారు. కొత్తవి ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ.. సొంత ఊరి సమస్యల పరిష్కారంలో తాను, తన కుటుంబ సభ్యులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. వాడరేవు నుంచి పిడుగురాళ్ల జాతీయ రహదారికి ఇరువైపులా డ్రైనేజీలను ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరావు, కలెక్టర్ జె.వెంకట మురళి, రాంకీ ప్రతినిధి రామిరెడ్డి, గ్రామ సర్పంచ్ బాలిగ శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.


మాకు తెలియకుండా ఓడీ...



బ్యాంకులో రూ. 40 లక్షలు ఫిక్సిడ్ డిపాజిట్ చేశాం. తీరా ఇప్పుడు వచ్చి మా పరిస్థితి ఏమిటని విచారిస్తే ఆ డిపాజిట్‌పై ఓవర్ డ్రాఫ్ట్ తీసుకున్నట్లు నమోదై ఉందని చెబుతున్నారు. మేము ఎలాంటి ఓడీ తీసుకోలేదు. ఓడీపై వడ్డీ చూస్తే మాకు ఏమి రావంటున్నారు. మాకు న్యాయం చేయాలి.

– బి శ్రీనివాసరావు


తెలియకుండా క్లోజ్ అంటున్నారు..



నేను బ్యాంకులో 218 గ్రాముల బంగారం పెట్టి రూ.5లక్షలు రుణం తీసుకున్నాను. రికార్డుల్లో రూ. 6.20 లక్షలు తీసుకున్నట్లు ఉంది. అది కూడా మాకు తెలియకుండానే మా అకౌంట్ క్లోజ్ అయినట్లు చూపుతున్నారు. ఖాతాదారులకు తెలియకుండా అకౌంట్ ఎలా క్లోజ్ చేస్తారు.

–గంగా గోపాలరావు

సమగ్ర విచారణ చేస్తున్నాం



బ్యాంకు ఎల్లప్పుడూ ఖాతాదారుల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యం ఇస్తుంది. చిలకలూరిపేట శాఖ లో అవకతవకలు జరిగినట్లు దృష్టికి రావడంతో సంబంధిత ఉద్యోగులను వెంటనే సస్పెండ్ చేశాం. ఈ విషయమై సమగ్ర విచారణ చేస్తున్నాం. నిజమైన క్లెయింలు కలిగి ఉన్న ఖాతాదారుల ఆర్థిక ప్రయోజనాలకు పూర్తి రక్షణ కల్పిస్తాం.

–సందీప్ మెహ్రా,ఐసీఐసీఐ బ్యాంకు జోనల్ మేనేజర్

క్లుప్తంగా

సత్తెనపల్లి ఆర్డీఓ రమాకాంతరెడ్డి బాధ్యతల స్వీకారం



సత్తెనపల్లి: సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ అధికారిగా గాజులపల్లి వెంకట రమాకాంతరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 57 మంది ఆర్డీఓలను బదిలీ చేసిన విషయం విదితమే. దీనిలో భాగంగా గురజాల ఆర్డీవోగా విధులు నిర్వర్తిస్తున్న వెంకటరమకాంతరెడ్డిని సత్తెనపల్లి బదిలీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ ఆర్డీవోగా విధులు నిర్వర్తిస్తున్న వి.మురళీకృష్ణ గురజాల ఆర్డీవోగా బదిలీ అయ్యారు. శుక్రవారం ఆర్డీఓ మురళీకృష్ణ రిలీవ్ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్డీవో వెంకట రమకాంత రెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అధికారులందరూ ప్రజల సమస్యలపై సత్వరమే స్పందించాలన్నారు. రెవెన్యూ సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా చూస్తానన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్డీవో వెంకటరమణకాంతరెడ్డిని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని తహసీల్దార్లు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

గురజాల ఆర్డీఓ మురళీకృష్ణ బాధ్యతల స్వీకారం



గురజాల: గురజాల రెవెన్యూ డివిజనల్ అధికారిగా వి మురళీకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆర్డీవోగా విధులు నిర్వర్తించిన జీవీ రమణా కాంత్‌రెడ్డి సాధారణ బదిలీల్లో భాగంగా సత్తెనపల్లికి వెళ్లారు. సత్తెనపల్లిలో విధులు నిర్వర్తిస్తున్న వి మురళీకృష్ణ గురజాలకు బదిలీపై వచ్చారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆర్డీవోను పలువురు తహసీల్దార్‌లు, రెవెన్యూ కార్యాలయం సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లాలో 255.8 మిల్లీమీటర్ల వర్షం నమోదు

నరసరావుపేట: జిల్లాలో గడిచిన 24గంటల వ్యవధిలో 255.8 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు సంబంధిత అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అత్యధికంగా రెంటచింతలలో 38.2 మి.మీటర్ల వర్షం కురిసింది. మాచర్లలో 23.6, వెల్దుర్తిలో 9.4, దుర్గిలో 16.2, కారెంపూడిలో 4.6, పిడుగురాళ్లలో 20.4, మాచవరంలో 1.2, బొల్లాపల్లిలో 28.4, వినుకొండలో 23.4, నూజెండ్లలో 9.2, శావల్యాపురంలో 31.8, ఈపూరులో 32.4, రొంపిచర్లలో 2.4, నరసరావుపేటలో 14.6 మి.మీ వర్షపాతం నమోదైంది. నాలుగురోజుల వ్యవధిలో 427.1 మి.మీ వర్షం పడాల్సివుండగా 457.0 వర్షం కురవడం విశేషం.

టెట్‌కు 39మంది గైర్హాజరు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో ఏపీ టెట్-2024 పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. పరీక్షను ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో నిర్వహిస్తుండగా, శుక్రవారం ఉదయం సెషన్ షెడ్యూల్‌లో పరీక్ష లేదు. మధ్యాహ్నం ఏఎం రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, ఎంఏఎం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన పరీక్షకు 260 మంది అభ్యర్థులకుగాను, 221మంది హాజరయ్యారు. మరో 39 మంది గైర్హాజరైనట్టు అధికారులు తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు ఎంఏఎం కళాశాల పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు.

24 గంటలు బుకింగ్ అవకాశం కల్పించండి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు



కోసూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

- సీపీఎం నాయకుల డిమాండ్
- ఇసుక కొరతపై ధర్నాలు

నరసరావుపేట: ఉచిత ఇసుక బుక్ చేసుకునే అవకాశాన్ని 24గంటలూ కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ డిమాండ్ చేశారు. ఇసుక వినియోగదారులు, భవన నిర్మాణ కార్మికులు, ముడిసరుకుల వినియోగదారుల తరపున జిల్లా కలెక్టరేట్ ఎదుట పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఇసుక బుకింగ్‌కు వారానికి ఒకసారి అర్ధరాత్రి ఆన్‌లైన్ ద్వారా అవకాశం కల్పించడంతో అక్రమదారులు మాత్రమే అవకాశం చేజిక్కించుకొని బ్లాక్‌మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. 2020లో టన్ను ఇసుక రూ.550 ఉంటే ప్రస్తుతం రూ.2వేలకుపైగా ఉందని, అయినా దొరకటం కష్టంగా మారిందన్నారు. భవన నిర్మాణ రంగంపై జిల్లాలో ఒక లక్ష కుటుంబాలు ప్రత్యక్షంగా ఉపాధి పొందుతుండగా మరో లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు జీవనం సాగిస్తున్నారన్నారు. జిల్లాలోని రేవులు ధరణికోట, జడుగు, మల్లాది, కస్తల, కోసూరు, చమంతి, వెంకటాపురంలో తెరచి, పిడుగురాళ్ల నుంచి పులిచింతలలో కూడా ఇసుక రేవులు ఏర్పాటు చేయాలని కోరారు. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలంటే ఇసుక రేవులు అన్నింటినీ తెరవాలని, తవ్వకంలో భారీ యంత్రాలను నియంత్రించాలని, రేవుల్లో స్థానికులకు అవకాశం ఇవ్వాలని, ర్యాంపుల వద్దనే వాహనాలకు ఇసుక లోడింగ్ చేయాలని, తెలంగాణ, కర్ణాటక, చెన్నై వంటి ఇతర రాష్ట్రాలకు తరలించకుండా నిఘా ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డి.శివకుమారి, జి.మస్తాన్‌వలి, శిలార్‌మసూద్, కామినేని రామారావు, టి.పెద్దిరాజు పాల్గొన్నారు.

క్రోసూరు: రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని కోరుతూ క్రోసూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి టి.హనుమంతరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత ఇసుకను అందిస్తానని హామీ ఇచ్చినప్పటికీ, ట్రక్కు ఇసుక ధర రూ.6000 వరకు చెల్లించాల్సి వస్తుందని అన్నారు. ఇసుక కొరత వల్ల భవన నిర్మాణ కార్మికులు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు ఆన్‌లైన్ విధానం ద్వారా 24 గంటలు ఉచిత ఇసుకను అందుబాటులో ఉంచే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. తహసీల్దార్ కె.శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. సీపీఎం గ్రామ కార్యదర్శి చిలక యేషియ్య, నాయకులు షేక్ ముస్తఫా, బత్తుల కొండలు, కె.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త

- నేడు 'పీఎం కిసాన్' రూ.2 వేలు విడుదల
- 'అన్నదాత సుఖీభవ'పై తేల్చని రాష్ట్ర సర్కారు

కొరిటెపాడు(గుంటూరు): పంట పెట్టుబడి సాయం కింద కేంద్ర ప్రభుత్వం శనివారం ఒక్కో రైతుకు రూ.2 వేల వంతున విడుదల చేయనుందని వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది రెండవ విడతగా (మొత్తంగా 18వ విడత) సాయం అందిస్తున్నట్లు పేర్కొన్నాయి. గుంటూరు జిల్లాలో అర్హత కలిగిన 86,674 మంది రైతుల ఖాతాల్లోకి రూ.17.34 కోట్ల పెట్టుబడి సాయం నేరుగా జమ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. తొలి విడతగా గత జూన్ 18వ తేదీన 85,400 మందికి రూ.17.08 కోట్లు ఇచ్చారన్నారు.

బాబూ.. రైతులు గుర్తున్నారా..?

అన్నదాతకు సాయం చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఎటూ తేల్చడం లేదు. ఒక్కో రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని గొప్పగా చెబుతూ 'సూపర్ సిక్స్'తో ఎన్నికల ముందు అదరగొట్టారు. తీరా అధికారం చేపట్టగానే దాని ఊసే ఎత్తడం లేదు. 'అన్నదాత సుఖీభవ' అంటూ పథకం పేరు మార్చి రైతులను ఏమార్చే ప్రయత్నం చేస్తున్నారు. రూ.20 వేలు ఎప్పటి నుంచి ఇస్తారు..? ఎన్ని విడతలుగా అందిస్తారు? పీఎం కిసాన్‌తో సంబంధం లేకుండా ఇస్తారా? రూ.6 వేలు పోను మిగతా రూ.14 వేలు అందిస్తారా? అనేది కూడా స్పష్టం చేయడం లేదు. ఇలా అన్నదాతలను మోసం చేస్తున్నారు. చంద్రబాబు సర్కారు నిర్లక్ష్య వైఖరిని రైతులు, రైతు సంఘాల నాయకులు, విపక్షాలు తీవ్రంగా తప్పుపడుతున్నాయి.

అన్నదాతలకు వైఎస్ జగన్ చేయూత

సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్న సమయంలో కరోనా వంటి అత్యంత విపత్కర పరిస్థితుల్లో సైతం రైతులకు అండగా ఉన్నారు. అన్నదాతల కష్టనష్టాల్లో తోడుగా నిలబడ్డారు. ఏటా క్రమం తప్పకుండా జూన్, అక్టోబర్, జనవరి నెలల్లో ప్రతి రైతుకు పీఎం కిసాన్‌తో కలిపి రూ.13,500 చొప్పున జమ చేశారు. కౌలు రైతులు, దేవదాయ, అటవీ భూమి సాగుదారులకు కేంద్రంతో సంబంధం లేకుండా పూర్తి స్థాయి పెట్టుబడి సాయం అందించారు. ఐదేళ్ల కాలంలో ఒక్కో రైతు ఖాతాలో రూ.67,500 మేర జమ చేశారు. ఏటా సగటున 1.20 లక్షల మంది రైతులకు సుమారు రూ.830 కోట్లు అందించి భరోసా కల్పించారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించాలని రైతులు కోరుతున్నారు. చంద్రబాబు ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని పేర్కొంటున్నారు.

నేడు రాష్ట్ర ఖోఖో జట్ల ఎంపిక

జే.పంగులూరు: నేడు స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాల ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో రాష్ట్ర ఖోఖో జట్టు ఎంపిక జరుగుతుందని ఖోఖో రాష్ట్ర కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖేలో ఇండియా జూనియర్, సబ్‌జూనియర్ సౌత్‌జోన్ ఖోఖో పోటీలకు (బాలబాలికలకు మాత్రమే) తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూర్ పట్టణంలో ఈ నెల 16,17,18 తేదీలలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. మన రాష్ట్రం నుంచి బాలబాలికలు అండర్-14, అండర్-17 విభాగంలో జట్టు ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఈ ఎంపికలో 13 జిల్లాల నుంచి బాలబాలికలు హాజరవుతారని, సుమారు 100 మంది పాల్గొంటారని చెప్పారు. వీరిలో అండర్-14 విభాగంలో 15 మంది, అండర్-17 విభాగంలో 15 మందిని ఎంపిక చేయనున్నట్లు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె భాస్కరరావు, బీ కాశి విశ్వనాథ్ తెలిపారు. ఎంపికైన వారికి 10 రోజుల పాటు కోచింగ్ క్యాంపులు నిర్వహించి కోయంబత్తూరు జరిగే జాతీయ స్థాయి సౌత్ జోన్ ఖేలో ఇండియా ఖోఖో పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

రేపు సీనియర్ బాలుర జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

గుంటూరువెస్ట్(క్రీడలు): గుంటూరు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ బాయ్స్ జిల్లా జట్టు ఎంపిక నిర్వహిస్తామని జిల్లా అధ్యక్షుడు కుమ్మరి క్రాంతికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలను ఆదివారం పేరేచర్ల క్రీడా మైదానంలో మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఎంపిక చేసిన జట్టును ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు పత్రాలు తీసుకురావాలని సూచించారు.

ఏఎన్‌యూకి ఐఎస్‌ఓ 9001:2015 సర్టిఫికేషన్



సర్టిఫికెట్‌ను ప్రదర్శిస్తున్న వీసీ గంగాధరరావు, రెక్టార్ రత్నషీలామణి, రిజిస్ట్రార్ సింహాచలం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి ఐఎస్‌ఓ 9001:2015 సర్టిఫికేషన్ లభించింది. ఈ సర్టిఫికెట్‌ను శుక్రవారం వీసీ కె.గంగాధర రావు, రెక్టార్ కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ జి.సింహాచలం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యూనివర్సిటీ నిర్వహణ, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, అంతర్జాతీయ ప్రమాణాలను ఈ సర్టిఫికెట్ తెలియజేస్తోందని వివరించారు. యూనివర్సిటీ కీర్తి ప్రతిష్టలు పెంచేందుకు నాణ్యమైన బోధన, పరిశోధన రంగాలను బలోపేతం చేసేందుకు ఇటువంటి గుర్తింపు సంస్థల సహకారం అవసరమని పేర్కొన్నారు. అటువంటి సంస్థల గుర్తింపుని తెచ్చుకునేలా అధ్యాపకులు, పరిశోధకులు నిరంతరం శ్రమించాలని సూచించారు. ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పీపీఎస్ పాల్‌కుమార్, ఏఎన్‌యూ ఐక్యుఏసీ డైరెక్టర్ కృష్ణసత్య, అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.గోపి కృష్ణ, ర్యాంకులకు విభాగం కోఆర్డినేటర్ రవి పాల్గొన్నారు.

ప్రతి గురువు పవిత్రత కలిగి ఉండాలి

గుంటూరు మేత్రాసన పీఠాధిపతులు చిన్నాబత్తిన భాగ్యయ్య



ఏసుక్రీస్తు సందేశాన్ని తెలియచేస్తున్న పీఠాధిపతులు చిన్నాబత్తిన భాగ్యయ్య

అచ్చంపేట: ప్రతి గురువు పవిత్రత కలిగి ఉండాలని, దేవుని చిత్తం ప్రకారం నడుచుకోవాలని ఉమ్మడి గుంటూరు జిల్లా పీఠాధిపతులు చిన్నాబత్తిన భాగ్యయ్య అన్నారు. మండలంలోని తాడువాయిలోని తిరుకుటుంబ దేవాలయంలో శుక్రవారం కోట రాజమోహనన్ గురుపట్టాభిషేక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఏసుప్రభు సందేశాన్ని వినిపించారు. క్రీస్తు అడుగులో అడుగులు వేస్తూ విశ్వాసం కలిగి ఉండాలని, నిర్మలమైన మనస్సు కలిగి ఉండి దివ్యపూజలు సమర్పించాలన్నారు. దైవధ్యానంలో నివసించాలని పిలుపునిచ్చారు. దేవుని చిత్తం ప్రకారం నడుచుకుంటూ ప్రజలకు సహాయపడాలని అదే నిజమైన గురుజీవితం అని అన్నారు. కార్యక్రమంలో తాళ్లచెరువులు విచారణ గురువు పుట్టి అంతోను, రేపూడి రాయప్ప, కస్తాల జాను, కోప్పూరి ప్రకాష్, చింతపల్లి అబ్రహం, క్రైస్తవ విచారణ కన్యా స్త్రీలు పాల్గొన్నారు.

నలుగురు గంజాయి విక్రేతల అరెస్టు

1200 గ్రాముల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కృష్ణయ్య

అద్దంకి రూరల్: జల్సాలకు అలవాటుపడి డబ్బులు సంపాదించాలని గంజాయి అమ్ముతున్న యువకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈఘటనపై సీఐ కృష్ణయ్య శుక్రవారం రాత్రి స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. సీఐ వివరాల మేరకు.. తాళ్లూరుకు చెందిన చేజర్ల ఫణిధర్ అద్దంకిలోని బస్టాండ్ వెనుకవైపు హన్విక పెట్ స్పా క్లినిక్ నడుపుతున్నాడు. దేవరకొండ బాల హరీష్‌కృష్ణ అలియాస్ హరీష్ స్పా సెంటర్ పక్కనే టాటూ షాపు నిర్వహిస్తున్నాడు. వీరికి వచ్చే డబ్బులు సరిపోకపోవడంతో అక్రమ మార్గం ఎంచుకున్నారు. ఈక్రమంలో వీరిద్దరికి తెలిసిన మూడో వ్యక్తి మార్టూరుకు చెందిన బిళ్ల ప్రకాష్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అప్పుడప్పుడు అద్దంకి వచ్చి గంజాయి అమ్ముతుంటాడు. ఫణిధర్, హరీష్‌లు ప్రకాష్ వద్ద తీసుకుని అమ్మటం, తాగటం చేస్తుంటారు. ప్రకాష్ తన అత్తగారి ఊరు అనకాపల్లి జిల్లా, నర్సీపట్నానికి చెందిన వ్యక్తి ద్వారా గంజాయి తెస్తుంటాడు. ఫణిధర్, హరీష్‌లు ఇద్దరూ ప్రకాష్ వద్ద గంజాయి తీసుకుని చిన్నచిన్న ప్యాకెట్లు కట్టి అధిక మొత్తంలో టాటు షాపు పక్కన ఒక ప్లాస్టిక్ బాక్స్‌లో ఉంచి అమ్ముతున్నారు. వీరినుంచి సుమారు 13 మంది యువకులు కొనుగోలు చేస్తున్నారు.

విద్యార్థులే టార్గెట్..

అంతేకాకుండా ఈక్రమంలో అద్దంకిలోని పోతురాజు గండి వద్ద మోటార్ మెకానిక్‌గా పనిచేస్తున్న పరుచూరి చందు గంజాయికి అలవాటు పడ్డాడు. బొగ్గులకొండ వద్ద స్వామిజీతో పరిచయం ఏర్పడి అక్కడి నుంచి గంజాయి తాగుతుంటాడు. మిగిలిన వాటిని ఫణిధర్‌కు, హరీష్‌కు విక్రయిస్తుంటాడు. విద్యార్థులను టార్గెట్ చేసుకుని వారితో స్నేహం చేసి గంజాయిని విక్రయిసుంటారు. వీరినే కాకుండా ఈ కేసులో గంజాయి కొనుగోలు చేస్తున్న వారిపై, అమ్ముతున్న వారిపై నిఘా ఉంచినట్లు సీఐ తెలిపారు. త్వరలోనే అందరినీ పట్టుకుంటామన్నారు. గురువారం సీఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో అద్దంకిలో తన సిబ్బందితో దాడులు జరిపి ఫణిధర్, హరీష్, బిళ్ల ప్రకాష్, చందు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.7200 విలువగల 1200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ కేసులో సహకరించిన అద్దంకి ఎస్సైలు ఖాదర్‌బాషా, ప్రవీణ, ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ ఐ.శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు జి.అంకమ్మరావు, పి.సాయి కృష్ణారెడ్డి, ఎం.గోపి, ఎస్.నాగరాజులను సీఐ అభినందించారు.

గుంటూరులో ఫ్లైఓవర్ నిర్మాణం ప్రారంభించాలి



దక్షిణ మధ్య రైల్వే జీఎం సమావేశంలో హాజరైన ఎంపీలు, రాజ్యసభ సభ్యులు అయోధ్యరామిరెడ్డి

- రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి
- రైల్వే జీఎం సమావేశంలో ప్రతిపాదన

లక్ష్మీపురం: గుంటూరు బ్రాడీపేట శంకర్ విలాస్ సెంటర్ ఫ్లైఓవర్ త్వరితగతిన నిర్మాణం చేయాలని రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి అన్నారు. విజయవాడలోని సత్యనారాయణపురం ఈటీటీ సెంటర్‌లో శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే అధికారులు, గుంటూరు, గుంతకల్లు, విజయవాడ డివిజన్‌ల ఎంపీలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు సంబంధించిన ఆర్‌ఓబీ, ఆర్‌యూబీ, ఇతర సమస్యల సంబంధించిన ప్రతిపాదనలపై చర్చించారు. ఎంపీ అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ గుంటూరు బ్రాడీపేట శంకర్ విలాస్ సెంటర్ బ్రిడ్జి 1957లో కేవలం రెండు లైన్ల వెడల్పుతో నిర్మాణం చేయటం జరిగిందని, దాని జీవిత కాలం 65 సంవత్సరాలు పూర్తి అయి సురక్షితమైన స్థితిలో లేదని అన్నారు. ప్రస్తుతం గుంటూరు నగరంలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిందని, ఆ వంతెన స్థానంలో కొత్త రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్‌ఓబీ) పునఃనిర్మాణం చేయాలని కోరారు. అదే విధంగా ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలో ఉన్న రైల్వే సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

కష్టపడే కార్యకర్తల కోసం గ్రీన్ బుక్

- అధికారంలోకి రాగానే వారికి తగిన ప్రాధాన్యం
- పదవీ స్వీకార సభలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి
- మా వారిపై దాడి చేసే ప్రత్యర్థుల కోసం బ్లడ్ బుక్ రాస్తాం
- గుంటూరు, నరసరావు పేట పార్లమెంటరీ నియోజకవర్గాల పార్టీ పరిశీలకుడు మోదుగుల హెచ్చరిక



అంబటి రాంబాబు, మోదుగుల వేణుగోపాలరెడ్డిలను సన్మానిస్తున్న నాయకులు

పట్నంబజారు/నెహ్రూనగర్: పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తల కోసం తాను గ్రీన్ బుక్ రాస్తానని వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అంబటి రాంబాబు స్పష్టం చేశారు. శుక్రవారం గుంటూరు నగరంలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో అంబటి రాంబాబు, మోదుగుల వేణుగోపాలరెడ్డి పదవీ స్వీకార సభ జరిగింది. పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు అధ్యక్షత వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. అంబటి, మోదుగుల మాట్లాడారు. కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటానని అంబటి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెడ్‌బుక్ రాజ్యాంగం నడిపిస్తోందని, తాము గెలిస్తే బ్లడ్ బుక్ రాస్తామని గుంటూరు, నరసరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గాల పార్టీ పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి హెచ్చరించారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ప్రసంగిస్తూ... వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కూడా కార్యకర్త మాదిరిగా పనిచేసుకుంటూ ముందుకు సాగుతున్నారని చెప్పారు. రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వైఎస్సార్‌సీపీ కేడర్‌కు మనోధైర్యాన్ని కల్పించి ముందుకు తీసుకెళ్లే సత్తా అంబటికి, మోదుగులకు ఉందన్నారు. పార్టీకి దూరమైన వారిని కూడా దగ్గర చేసే దిశగా ప్రతి ఒక్కరూ సాగాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలకు ఎటువంటి కష్టం వచ్చినా తోడుగా నడిచేందుకు పార్టీ నాయకత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ సుదీర్ఘ అనుభవం ఉన్న నేతలకు సముచిత స్థానం కల్పించి పార్టీని బలోపేతం చేసే దిశగా తీసుకున్న నిర్ణయం సంతోషకరం అన్నారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ పాలన పక్కన పెట్టి కేవలం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను టార్గెట్ చేస్తూ టీడీపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. మాజీ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ ఎన్నికల్లో పార్టీ ఓడిపోలేదని, మోసపోయిందని పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మాజీ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన 5 ఏళ్ల పాలనలో విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారని గుర్తుచేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ రెండింటిని నిర్వీర్యం చేస్తోందన్నారు. పార్టీ నేత పూనూరి గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ వంద రోజుల పాలనలో 60 మందిని పొట్టనబెట్టుకున్న చంద్రబాబుపై 302 సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర గ్రంథాలయాల మాజీ చైర్మన్ మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగు నెలల కాలంలోనే ప్రజలంతా విసుగెత్తిపోయారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ ఇది ఫెయిల్యూర్ ప్రభుత్వమని మండిపడ్డారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల వారికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పాలన ఈ దేశంలో ఎవరూ అందించలేదన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా పార్టీని ఒక తాటిపై తీసుకువచ్చి విజయానికి కృషి చేద్దామన్నారు. తెనాలి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ వైఎస్ జగన్ ప్రతి జిల్లా నాయకులతో రివ్యూ మీటింగ్‌లు పెట్టి పార్టీని బలోపేతం చేస్తున్నారని గుర్తుచేశారు. పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఏడు నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతానికి అందరం కలిసి కట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు.

మంచితనాన్ని చేతగాని తనం అనుకుంటే పొరపాటే...

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, మంచితనాన్ని చేతగానితనం అనుకుంటే పొరపాటే... ఇకపై ఎవరికి వారే రెడ్‌బుక్ రాసుకోండని చెప్పారు. నాలుగు నెల పాలన చూస్తేనే పూర్తిగా టీడీపీ వైఫల్యం అర్థమవుతోందన్నారు. ప్రతిపక్ష లేకుండా ఎలిమినేట్ చేయాలని దురుద్దేశంతో రాక్షస మూకలు హింసాకాండలు, దౌర్జన్యాలతో పేట్రేగిపోతున్నారన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వై.ఎస్.జగన్ ఒక్క కనుసైగ చేసి ఉంటే అసలు ఇవాళ టీడీపీ ఉండేది కాదని తేల్చి చెప్పారు. పవిత్రమైన లడ్డూ విషయంలో సుప్రీం కోర్టు చంద్రబాబుకు మొట్టికాయలు వేసిందన్నారు. పవన్ కళ్యాణ్ తన పార్టీని బీజేపీతో కలిపేసినట్లు ఉన్నారన్నారు.

నిత్యం అందుబాటులో ఉంటా

ఈ సభ ద్వారానే తాను గ్రీన్‌బుక్ ఓపెన్ చేస్తున్నా. కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్త పేరు ఆ బుక్‌లో రాస్తా. అధికారంలోకి వచ్చిన తరువాత వారి పేరును వై.ఎస్.జగన్ దృష్టికి స్వయంగా తీసుకెళతా. కార్యకర్తల్లో మనోధైర్యాన్ని నింపి ముందుకు సాగే దిశగా అన్ని వేళలా అందుబాటులో ఉంటా. గుంటూరు జిల్లాలో ఎంపీ, ఏడు ఎమ్మెల్యే స్థానాలకు ఎప్పుడు ఎన్నికలు జరిగినా గెలిపించుకునేందుకు మండల స్థాయి నుంచి ప్రతి కార్యకర్తను ఏకం చేసి ముందుకు సాగుతాం

–అంబటి రాంబాబు, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు

కార్యకర్తల కోసం ఏర్పాటైన సభలా ఉంది

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెడ్‌బుక్ రాజ్యాంగం నడిపిస్తోంది. మేం అధికారంలోకి రాగానే బ్లడ్ బుక్ రాస్తాం. ఈ సభ పదవీ స్వీకార సభలా కాకుండా.. కార్యకర్తల కేర్ సభలా ఉంది. మళ్లీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి పథకం కేడర్ చేతుల మీదుగానే ప్రజలకు అందదాలన్న విషయాన్ని వై.ఎస్.జగన్ దృష్టికి తీసుకెళ్తా. సాయం చేసే చేతులు వై.ఎస్.జగన్‌వి. మాయమాటలు చెప్పే నైపుణ్యం చంద్రబాబుది. దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి పేదల గుండెల్లో ధైర్యాన్ని నింపారు. వై.ఎస్.జగన్ అదే పేదలకు సంక్షేమాన్ని అందజేశారు. నేను రెండు త్రిపుల్ ఆర్ సినిమాలు చూశా. ఒకటి ఎన్టీఆర్ నటించింది కాగా... రెండో సినిమాలో రామోజీరావు, రాధాకృష్ణ, బీఆర్ నాయుడు నటించిన చిత్రం చంద్రబాబు డైరెక్షన్‌లో చూశా. మా వాళ్లపై దాడి చేస్తే బ్లడ్ బుక్‌లో రాయడం ఖాయం. అధికారులు వ్యవహరిస్తున్న తీరును అనుక్షణం గమనిస్తాం.

–మోదుగుల వేణుగోపాలరెడ్డి, గుంటూరు, నరసరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గాల పార్టీ పరిశీలకుడు